# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

మే - 2017

**సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.100/-**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-4 |
| 2. | బాధ్యత | 5-7 |
| 3. | నీతోనున్న దేవుని హస్తం | 8-9 |
| 4. | దీనత్వంలో హెచ్చింపు | 10-16 |
| 5. | సువార్త ఉజ్జీవ కూటములు | 17 |
| 6. | బోయజు | 18-19 |




## ఎడిటర్ అర్పణ

**మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా వందనములు.**

**"నిన్ను ప్రేమించి యేడుగురు కుమారులకంటె నీ కెక్కువగానున్న నీ కోడలు ఇతని కనెను"** రూతు 4:15. దేవుని వాక్యము ఎన్నటికి సత్యమైనది. బేత్లెహేము ప్రజలు నయోమితో ఆమె పలికిన బలహీనమైన మాటల గురించి మాట్లాడుటలేదు గాని రూతుకు కుమారుడు పుట్టిన వెంటనే రూతు వలన నయోమి పొందిన ప్రేమను గుర్తు చేశారు. కోడలు అత్తకు యేడుగురు కుమారులకంటె ఎక్కువ ప్రేమను అందించవలెను. ఇది దేవుని వాక్య క్రమము మరియు దేవునికి మహిమ.

**"ఆమె పెనిమిటియైన ఎల్కానా - హన్నా, నీ వెందుకు ఏడ్చుచున్నావు? నీవు భోజనము మానుట ఏల? నీకు మనోవిచారమెందుకు కలిగినది? పదిమంది కుమాళ్లకంటె నేను నీకు విశేషమైనవాడను కానా? అని ఆమెతో చెప్పుచు వచ్చెను"** 1సమూ 1:8. యెహోవా హన్నాకు సంతులేకుండా చేసియున్న హేతువునుబట్టి ఆమె వైరియగు పెనిన్నా ఆమెను విసిగించుటకై ఆమెకు కోపము పుట్టించుచు వచ్చెను. హన్నా యెహోవా మందిరమునకు పోవునప్పుడెల్ల అది ఆమెకు కోపము పుట్టించెను గనుక ఆమె భోజనము చేయక ఏడ్చుచు వచ్చెను. అప్పుడు ఆమె భర్తయైన ఎల్కానా నీవు ఎందుకు ఏడ్చుచున్నావు పదిమంది కుమారులకంటె నేను నీకు విశేషమైనవాడను కానా? అని హన్నాతో అనెను.

ప్రియులారా! ప్రభువు తన ఆఖరిశ్వాస వరకు కరిగిపోయి మన కొరకు రక్తము కార్చి మనలను కొన్నారు. మనలను రక్షించుటకు ఆయన పరలోకమును విడిచి వచ్చెను. దీనిని బట్టి మన కొరకు ఎంత వెల చెల్లించబడినదో మనకు అర్థమౌతుంది. ఈ లోకములో భర్తలుగా, కోడళ్ళుగా సమాజములో వారి పాత్రను నిర్వహిస్తున్నారు మరి మన పాత్ర ఏమిటి? మనము ప్రభువు యొక్క గుణాతిశయములను ప్రపంచమంతటా ప్రచురపరచుటకు ఏర్పరచబడినవారము. అది మన బాధ్యత మరి మనము ఈ పాత్రను నిర్వహిస్తున్నామా?

**"అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురముచేయు నిమిత్తము**

**ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజకసమూహమును, పరిశుద్ధజనమును దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు"** 1పేతురు 2:9. ఎన్ని శ్రమలు వచ్చినను సంఘము యొక్క పరిస్థితి, దేశము యొక్క పరిస్థితులు ఏలాగు ఉన్నను మనకు అప్పగించబడిన బాధ్యతలను మనము నిర్వహించవలెను అప్పుడే ప్రభువు నామము మన ద్వారా మహిమపరచబడుతుంది.

రూతు తన అత్తయైన నయోమిని ఆదరించినది, ఎల్కానా తన భార్యయైన హన్నాకు తన ప్రేమను పంచాడు. క్రీస్తు రక్తములో కడుగబడి పరిశుద్ధమైన మూల్యముతో కొనబడిన మనము ప్రస్తుత కాల సంఘమునకు, సమాజమునకు ఏలాటి ప్రేమను అందించుచున్నాము? సత్యం కొరకు జీవించేవారి కొరకు నిజమైన క్రీస్తు ప్రేమను అందించే వారి కొరకు ప్రపంచము ఎదురు చూచుచున్నది.

ప్రభువు 2017 కన్వెన్షన్ బహు ఆశీర్వాదకరముగా జరిగించినారు. కన్వెన్షన్ కొరకు ప్రార్థించి, పాల్గొని సహకరించిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక వందనములు తెలియజేయుచున్నాను. విత్తబడిన దేవుని వాక్యము పాల్గొన్న వారి జీవితములలో ఫలించునట్లుగాను, వారు ఆత్మీయముగా స్థిరపడి దేవుని రాజ్యవ్యాప్తి కొరకు, దేవునికి మహిమకరముగాను జీవించునట్లుగా మీ అనుదిన ప్రార్థనలలో జ్ఞాపకం చేసికొనగలరు.

ఈ మాసమంతా జరిగే సువార్త కూటముల కొరకు ప్రార్థింగలరు. ఈ పత్రికను ఇతరులకు పరిచయము చేసి దేవుని పనిలో సహకరించి ఆశీర్వదించబడండి. ప్రభువు కృప మీకు తోడైయుండును గాక!

*- ఎడిటర్*

**సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన**

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥**9.00** ల నుండి ఉ॥**5.00** గం॥ల వరకు



## బాధ్యత

**"ఎట్లనగా - నా జనుల మొఱ్ఱ నాయొద్దకు వచ్చెను, నేను వారిని దృష్టించియున్నాను; కాగా ఫిలిష్తీయుల చేతిలోనుండి నా జనులను విడిపించుటకై నా జనులైన ఇశ్రాయేలీయుల మీద వానిని అధికారినిగా అభిషేకించుటకుగాను రేపు ఈ వేళకు నేను బెన్యామీను దేశములోనుండి ఒక మనుష్యుని నీ యొద్దకు రప్పించుదును"** 1సమూ. 9:16. సౌలు తన తండ్రియైన కీషు యొక్క గార్దభములు తప్పిపోగా తన దాసులలో ఒకని తీసికొని వాటిని వెదకుచుండెను. వారు బెన్యామీనీయుల దేశము సంచరించి చూడగా అవి దొరుకలేదు. సౌలు తిరిగి తన తండ్రి యొద్దకు వెళ్ళిపోవలెనని తన పనివానితో చెప్పగా పనివాడు ఈ పట్టణములో దైవజనుడు ఒకడున్నాడు. గార్దభముల విషయమై మనము వెళ్ళవలసిన మార్గమును అతడు మనకు తెలియజేయునేమో అని అతనియొద్దకు వెళ్ళుదము రండని చెప్పెను.

సౌలు గాడిదలను పోగొట్టుకొని వెదకుచున్నాడు. దేవుడే సౌలుకు గాడిదలు పోగొట్టుకొనిన పరిస్థితులు కల్పించెను గనుకనే తాను సమూయేలును కలుసుకునే అవకాశం దొరికింది. నీ జీవితములో ఏదైనా పోగొట్టుకొన్నప్పుడు నీవు ఒక శ్రేష్టమైన వ్యక్తిని కలుసుకుంటావు, ఉత్తమమైనవి పొందుకుంటావు. పోగొట్టుకొన్న గాడిదలను వెదకడం ఏమిటి? సింహాసనం దొరకడం ఏమిటి? గాడిదల కొరకు వెదకుచున్న వ్యక్తికి దేవుడు సింహాసనం యిచ్చెను. ఒకవేళ గాడిదలే తప్పిపోకపోతే సౌలు సమూయేలును కలుసుకునేవాడు కాదు, నీవు రాజువౌతావు అని సౌలుతో సమూయేలు చెప్పేవాడు కాదు. ఎక్కడైన ఎప్పుడైన నీ జీవితములో నష్టం జరుగుతున్నప్పుడు దేవుడు నీ ఊహకందని కార్యములు నీ కొరకు సిద్ధం చేసియుంచాడని నీవు గ్రహించాలి. అయితే అది నీకు అర్థం కాదు కనుమరుగుగా ఉంటుంది, నీవు దానిని అర్థం చేసికొంటే గొప్ప ఆశీర్వాదం పొందుకుంటావు. సౌలు పోగొట్టుకొనిన గాడిదలు ఎంత విలువ చేస్తాయి. అయితే దాని మూలముగా సౌలు నలభై సంవత్సరాలు రాజుగా పనిచేసే అవకాశం దొరికింది.

రేపు నీ దగ్గరకు సౌలు వస్తాడు అని దేవుడు సమూయేలుతో చెప్పెను. సౌలు రేపు వస్తాడు అనే విషయాన్ని సమూయేలుకు దేవుడు ముందే తెలియజేసెను. దేవుడు చెప్పిన విషయములో సమూయేలు నిర్లక్ష్యముగా లేడు. **"సౌలు సమూయేలునకు కనబడగానే యెహోవా – ఇతడే నేను నీతో చెప్పిన మనిషి ఇదిగో ఇతడే నా జనులను ఏలునని అతనితో సెలవిచ్చెను. సౌలు గవినియందు సమూయేలును కలుసుకొని..."** 1సమూ. 9:17,18. రేపు ఈ వేళకు బెన్యామీను దేశములో నుండి ఒక మనుష్యుని నీ యొద్దకు రప్పించెదనని దేవుడు చెప్పిన మాటకు సమూయేలు ఎంతో సిద్ధపాటు కలిగి యున్నాడు. ప్రవక్త గవిని దగ్గర ఉన్నాడు. సౌలు ఆ గవిని దగ్గర సమూయేలును కలిసెను. సౌలు ఎవరో సమూయేలుకు తెలియదు గాని గవిని దగ్గర కలుసుకున్నారు. **"సమూయేలు సౌలుతో – నేనే దీర్ఘదర్శిని, ఉన్నతమైన స్థలమునకు నాకు ముందు వెళ్లుడి, నేడు మీరు నాతో కూడ భోజనము చేయవలెను"** 1సమూ. 9:19. దేవుడు సమూయేలుతో సౌలు రేపు వస్తాడు అని చెప్పెను గాని భోజనం సిద్ధం చేయుమని చెప్పలేదు. అయితే సమూయేలు నేడు మీరు నాతో కూడ భోజనము చేయవలెనని చెప్పెను. ఎవరైనా మీకు ఏదైనా పని చెప్తే మీరు ఒక్క పనే చేయగలరు, మీకు చేయాలని ఆశ ఉంటే పదికోట్ల పనులు చేస్తారు. ఈ త్రోవలో మనము మరలా రాము. మనము దేవుని కొరకు ఏమి చేయవలెనన్న ఈ జీవితకాలములో తప్ప ఇంకొక తరుణం లేదు.

**"అయితే సమూయేలు సౌలును అతని పనివానిని భోజనపు సాలలోనికి తోడుకొనిపోయి పిలువబడిన దాదాపు ముప్పై మందిలో ప్రధానస్థలమందు వారిని కూర్చుండబెట్టి"** 1సమూ. 9:22. సౌలును సమూయేలే భోజనపుసాలయొద్దకు తీసుకొని వెళ్ళాడు. సమూయేలు ముందుగానే ముప్పైమందిని భోజనమునకు పిలిచాడు. సౌలును ముప్పైమందిలో ప్రధానమైన స్థలములో కూర్చుండబెట్టుటకు కారణం సౌలు రాజు కాబోవుచున్నాడు. సమూయేలు ప్రధాన స్థలములో కూర్చోలేదు గాని సౌలును ప్రధాన స్థలములో కూర్చుండబెట్టాడు. ప్రవక్తయైన సమూయేలు భోజన సమయానికి ఎవరిని పిలవాలో వారినందరిని పిలిచెను. తానే సౌలును భోజనసాలకు తోడుకొని వెళ్ళాడు, తానే ముప్పైమందిని పిలిచాడు.



**"పచనకర్తతో నేను నీ దగ్గరనుంచమని చెప్పి నీ చేతికి ఇచ్చిన భాగమును తీసికొని రమ్మనగా పచనకర్త జబ్బను దాని మీదనున్న దానిని తీసికొనివచ్చి సౌలు ఎదుట ఉంచగా...** 1సమూ. 9:23. సమూయేలు పచనకర్తతో సౌలు కొరకు జబ్బను దాచియుంచమని చెప్పెను. సమూయేలు సౌలుతో చూడుము మనము కలిసికొను కాలమునకై దాచియుంచబడిన దానిని నీకు పెట్టియున్నాడని చెప్పెను. ముప్పైమందికి ఏమి పెట్టాలో అది పెట్టాడు. కాబోయే రాజుకు ఏమి పెట్టాలో అది పెట్టాడు. పచనకర్తతో జబ్బను తయారు చేయించాడు. నీకు అన్నీ సిద్ధంగా ఉంటే చేయడం ఏముంది?

ఒక క్రైస్తవుడు పని చేయాలి అంటే విశ్వాసం కావాలి, చేసే మనస్సు కావాలి. నీవు చేయవలసిన దాని గురించి నీకు ఒక ప్రణాళిక కావాలి. నీవు దేవుని స్వరమును వినాలి ప్రార్థన సమయమును కాపాడుకోవాలి. వాక్యధ్యాన సమయమును కాపాడుకోవాలి. నీ జ్ఞానం ప్రక్కన పెట్టాలి ప్రభువు చిత్తం చేయుటకు లోతైన విశ్వాసమును సంపాదించుకోవాలి. మరునాడు సమూయేలు నిన్ను సాగనంపుటకై లెమ్ము అని చెప్పగా సౌలు లేచెను తరువాత ఇద్దరు బయలుదేరిరి.

**"ఊరి చివరకు వచ్చుచుండగా సమూయేలు సౌలుతో మనకంటె ముందుగా వెళ్లుమని ఈ పనివానితో చెప్పుము. దేవుడు సెలవిచ్చినది నేను నీకు తెలియజెప్పువరకు నీవు ఇక్కడ నిలిచియుండుమనెను. అంతట వాడు వెళ్లెను."** 1సమూ 9:27. సమూయేలు దేవుడు సెలవిచ్చినది నేను నీతో చెప్పెదను అయితే మనకంటె ముందుగా పనివాడిని పంపించుమని సౌలుతో చెప్పెను. ఎంతో దైవికమైన జ్ఞానమును సమూయేలు కలిగియుండెను. దేవుడు చెప్పిన విషయమే గాని అది పనివాడి ముందు మాట్లాడడం సమూయేలుకు ఇష్టంలేదు. కొన్నిసార్లు మనకు ఎక్కడ ఏది మాట్లాడాలో అర్థం కాక వ్యర్థముగా మాట్లాడుతుంటాం. దాని వలన మన జీవితములో ఎంతో నష్టం జరుగుతుంది. నీ మాటలు బహు జాగ్రత్తగా ఉండాలి అవి జీవితాన్ని కట్టనైనా కడతాయి లేకపోతే కూల్చనైనా కూల్చుతాయి.

## నీతో నున్న దేవుని హస్తం

**వీటి అన్నిటినిబట్టి యోచించుకొనినయెడల యెహోవా హస్తము వీటిని కలుగజేసెనని తెలిసికొనలేనివాడెవడు?** యోబు 12:9

చాలా సంవత్సరాల క్రితం ఆఫ్రికాలోని ఒక గనిలో ప్రపంచ చరిత్ర అంతటిలో కనీవినీ ఎరుగని ప్రశస్తమైన వజ్రం ఒకటి దొరికింది. దాన్ని ఇంగ్లాండు దేశపు రాజుకు ఆయన కిరీటంలో పొదగటం కోసం బహుమతిగా ఇచ్చారు. ఆయన దాన్ని మెరుగు పెట్టించడానికి ఆమ్‌స్టెర్‌డామ్ నగరానికి పంపాడు. ఒక నిపుణుడైన వజ్రకారుడికి దాన్ని అప్పగించారు. దాన్ని అతను ఏం చేశాడనుకున్నారు?

ఆ అమూల్యమైన రాయిని తీసుకొని చిన్న గాడి చేసాడు. తన పనిముట్టును ఆ గాడిలో పెట్టి ఒక దెబ్బ కొట్టాడు. ఆ వజ్రం రెండు ముక్కలైంది! ఎంత నిర్లక్ష్యం, ఎంత వ్యర్థం అయిపోయింది? అంత అజాగ్రత్త ఏమిటి? అనుకుంటున్నారా?

పొరపాటు కొన్నివారాల పాటు ఆ దెబ్బని ఎక్కడ ఎలా వేయాలి అని అతి జాగ్రత్తగా ఆలోచనలు జరిగాయి. ఆ వజ్రపురాయిని అన్ని కోణాల నుంచి పరిశీలించి బొమ్మలు గీసుకున్నారు. దాని నాణ్యత, దానిలో ఉన్న లొసుగులు, పగుళ్ళు అన్నిటినీ అతి జాగ్రత్తగా అర్థం చేసుకున్నారు. ఎందుకంటే ఆ వజ్రాన్ని పదును పెట్టడానికి తీసుకున్నది ప్రపంచంలోకెల్లా అత్యంత నిపుణతగల వజ్రకారుడు.

దాన్నలా మధ్యలోకి పగులకొట్టడం పొరపాటనుకోకండి. అది ఆ నిపుణుడి నేర్పుకి పరాకాష్ఠ. ఆ వజ్రాన్ని దానికి ఉండగలిగినంత మెరుపూ, సౌందర్యమూ, కళ తీసుకురావాలంటే ఆ దెబ్బ పడాలి. మొత్తంగా ఉన్నదాన్ని రెండు ముక్కలు చేసి చెడగొట్టినట్లు పైకి కనిపించిన దానికి అత్యంత సౌష్టవాన్ని చేకూర్చడానికి అది జరగాల్సిందే. ఎందుకంటే ఆ రెండు ముక్కలనుంచి అపూర్వమైన వజ్రాలు తయారైనాయి. వాటిలో నిగూఢమై ఉన్న కోణాలు, మెరుపులు ఆ వజ్రకారుడి కన్ను కనిపెట్టింది.



ఇలాగే నీ జీవితంపై ఒక్కోసారి పగులగొట్టే దెబ్బ పడనిస్తుంటాడు. రక్తం కారుతుంది. నరాలు లాగుతాయి. ఆత్మ బాధతో మూలుగుతుంది. ఆ దెబ్బ దేవుడు చేసిన పొరపాటని నీకనిపిస్తుంది. కాని అది నిజం కాదు. దేవునికి నీవొక అమూల్యమైన రత్నానివి. ఆయన విశ్వమంతటిలోనూ అతి నిపుణుడైన రత్నాల పనివాడు.

ఒక రోజున నిన్ను తీసుకొని వెళ్ళి ఓ రాజు పెట్టుకున్న కిరీటంలో పొదుగుతారు. అయితే ఇప్పుడు మాత్రం నీవు దేవుని చేతిలో ఉన్నావు. నీతో ఏం చేయాలో ఆయనకు తెలుసు. దేవుని ప్రేమ చొప్పున తప్పించి వేరే విధంగా ఒక్క దెబ్బ కూడా నీ మీద పడదు. నీవు ఊహించని ఆలోచించని ఆత్మీయాశీర్వాదాలు ఆ దెబ్బ మూలాన నీకు సమకూడుతాయి.

జార్జి మెక్‌డోనాల్డ్ రాసిన పుస్తకంలో ఈ సంభాషణ ఉంది.

"దేవుడు నన్నెందుకు చేసాడో అర్థం కావడం లేదు. మిసెస్ ఫేబర్ అంది కసిగా "నన్ను చేయడం వలన ప్రయోజనమేమిటో నాకర్థం కాదు."

"ఇప్పుడిప్పుడే కాదేమో" అంది డోరతి. అయితే "నిన్నింకా దేవుడు వదిలెయ్యలేదుగా. ఇంకా నిన్ను తయారుచేస్తూనే ఉన్నాడు. తయారీలో ఉండగానే విసుక్కుంటున్నావు.

మనుషులు తామింక తయారవుతున్న స్థితిలోనే ఉన్నామని నమ్మి దేవునికిష్టం వచ్చినట్టుగా తమని తయారుచేయడానికి సమ్మతించి కుమ్మరివాడు మట్టికి చేసినట్లుగా దేవుడు తమపట్ల చెయ్యడానికి విధేయులవుతూ ఉన్నట్టయితే ఈ తయారీలు వాళ్ళ మీదికి వచ్చే పీడనాలనూ, ఉలిదెబ్బలనూ ఓపికతో ఆహ్వానిస్తూ నొప్పిగా ఉన్నప్పటికీ భరిస్తూ ఉంటే తాము చివరికి ఎలాటి రూపుదిద్దుకుంటారో గుర్తిస్తారు. తమను కుమారులుగా మహిమలోకి తీసుకురావాలన్న ఆయన ఉద్దేశాలను కనుగొంటారు.

## దీనత్వంలో హెచ్చింపు

**"తరువాత సమూయేలు రాజ్యపాలనపద్ధతిని జనులకు వినిపించి, ఒక గ్రంథమందు వ్రాసి యెహోవా సన్నిధిని దాని నుంచెను. అంతట సమూయేలు జనులందరిని వారి వారి ఇండ్లకు పంపివేసెను. సౌలును గిబియాలోని తన ఇంటికి వెళ్లిపోయెను. దేవునిచేత హృదయ ప్రేరేపణ నొందిన శూరులు అతని వెంట వెళ్లిరి. పనికిమాలినవారు కొందరు – ఈ మనుష్యుడు మనలను ఏలాగు రక్షింపగలడని చెప్పుకొనుచు అతని నిర్లక్ష్యము చేసి అతనికి కానుకలు తీసికొని రాకుండగా అతడు చెవిటివాడైనట్టు ఊరకుండెను"** 1సమూ.10:25-27. సౌలు రాజైనప్పుడు రెండు రకాలైన ప్రజలు ఉన్నారని దేవుని వాక్యం తెలియజేస్తుంది. ఒకరు దేవుని చేత హృదయ ప్రేరేపణ నొందిన శూరులు, మరొకరు పనికిమాలినవారు.

ఏలీయా కూడా ప్రజలతో ఇలా అన్నాడు **"జనులందరి దగ్గరకు వచ్చి – యెన్నాళ్ల మట్టుకు మీరు రెండు తలంపుల మధ్య తడబడుచుందురు? యెహోవా దేవుడైతే ఆయనను అనుసరించుడి, బయలు దేవుడైతే వాని ననుసరించుడని ప్రకటన చేయగా, జనులు అతనికి ప్రత్యుత్తరముగా ఒక మాటైనను పలుకక పోయిరి"** 1రాజులు 18:21. ప్రజలు ఎప్పుడు రెండు తలంపుల మధ్యనే ఉంటారు. ఇది మనిషి యొక్క స్వభావం. సౌలు కాలంలో కూడా దేవుని చేత హృదయ ప్రేరేపణ నొంది తనతో నడిచిన ప్రజలు ఉన్నారు. పనికిమాలినవారు కూడా కొందరు ఉండి కానుకలు తీసికొని రాకుండా ఉన్నారు. వారు సౌలును గూర్చి చెడుగా మాట్లాడుకుంటుంటే తాను చెవిటివాడిలాగా ఉన్నాడు. కొందరి మాటలకు మనం జవాబు చెప్పకూడదు. మనం ఎంత మౌనంగా ఉంటే అంత మంచిది అది మనకు ఆశీర్వాదం. మనము ఎవరము? దేవుని చేత హృదయ ప్రేరేపణ నొందిన శూరులమా? పనికిమాలినవారమా? పనికిమాలినవారు దేవుని చిత్తంలో దేవుడు నియమించిన రాజును, అభిషేకించబడిన వ్యక్తులను కలిసి నడువరు. సౌలును సమూయేలు ప్రవక్త అభిషేకించెను. ఆ అభిషేకాన్ని గుర్తించి దేవుని చేత హృదయ ప్రేరేపణ నొందిన శూరులు అతని వెంట వెళ్లిరి. నీవు ఒక



విషయములో దేవుని చిత్తాన్ని ఆమోదించి నడవడంలో చాలా గొప్ప ఆశీర్వాదం ఉంటుంది.

**"వారు లోకసంబంధులు గనుక లోకసంబంధులైనట్టు మాటలాడుదురు, లోకము వారి మాట వినును. మనము దేవుని సంబంధులము; దేవుని ఎరిగినవాడు మన మాట వినును, దేవుని సంబంధి కానివాడు మన మాట వినడు. ఇందువలన మనము సత్యస్వరూపమైన ఆత్మ యేదో, భ్రమపరచు ఆత్మ యేదో తెలిసికొనుచున్నాము"** 1యోహాను 4:5,6 వారు లోకసంబంధులు గనుక వారు లోకసంబంధులైనట్టు మాట్లాడతారు. లోకం వారి మాట వినును. దేవుని సంబంధి కానివాడు మన మాట వినడు. దీనిని బట్టి మనము సత్యసంబంధమైన ఆత్మ ఏదో భ్రమపరచు ఆత్మ ఏదో గుర్తుపట్టవచ్చు. ప్రజలు రెండు తలంపుల మధ్య ఉన్నారని గ్రహించడం ఒక మెట్టు అయితే వారు ఆత్మసంబంధమైనవారో కారో అనేది గుర్తుపట్టడం మరొక మెట్టు. హృదయ ప్రేరేపణ కలిగిన శూరులు సౌలు వెంట వెళ్లిరి. వారికి సౌలుతో వెళ్ళుమని, అతని రాజరికాన్ని అంగీకరించుమని, అతనితోపాటు కలిసి పనిచేయుమని ప్రత్యేకముగా ఎవరు చెప్పలేదు.

మనము వాక్యము జాగ్రత్తగా చదువుకోవాలి. వాక్యాన్ని జాగ్రత్తగా అనుసరించాలి. వాక్యమే నిన్ను నడిపించేది. అందులో ఏమాత్రం సందేహం లేదు. నీవు వాక్యాన్ని చదివి తీసికొనినట్లయితే నీ జీవితములో నీ మాటలో నీ ప్రవర్తనలో నీ చూపులో కూడా వ్యత్యాసాన్ని చూస్తావు. నీవు వాక్యాన్ని తీసికొనినట్లయితే నీ హృదయం పగులుతుంది, పశ్చాత్తాపం కలుగుతుంది, మారుమనస్సు పొందుతావు. నీ ప్రవర్తనలో కూడా చాలా అత్యున్నతమైన మార్పును చూడగలవు.

దేవుడు సౌలును ఎన్నుకున్న ఉద్దేశం గొప్పది. కాని సౌలు నడుచుకొనిన విధానం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. **"బెన్యామీను గోత్రమును వారి యింటి కూటముల ప్రకారము అతడు సమకూర్చగా మత్రీ యింటి కూటము ఏర్పడెను. తరువాత కీషు కుమారుడైన సౌలు ఏర్పడెను అయితే జనులు అతని వెదకినప్పుడు అతడు కనబడలేదు... యెహోవా – ఇదిగో అతడు సామానులో దాగియున్నాడని సెలవిచ్చెను"** 1సమూ.10:21,22. సౌలు ఏ తప్పు చేయలేదు కాని

దాగుకొన్నాడు. సమూయేలు ప్రవక్త అభిషేకించినప్పుడే దేవుడు తనను ఏర్పరచుకొన్నాడని సౌలుకు తెలుసు. మరి ఇప్పుడు ఎందుకు దాగుకున్నాడు అంటే నా కుటుంబం ఏపాటిది? అసలు నేను ఏ పాటివాడను, నేను రాజును అవ్వడం ఏమిటి అని దాగుకున్నాడు. దేవుడు ఆ వ్యక్తిని హెచ్చిస్తున్నప్పుడు అతను దాగుకుంటున్నాడు. జనులు ఒక దీనుడైన సౌలు వెంట నడుస్తున్నారు. దేవుని యొక్క ఏర్పాటులో ఎన్నటికి పొరపాటు ఉండదు. తప్పిపోయిన యూదాను చూసినప్పుడు దేవుడు యూదాను ఎలా ఎన్నుకున్నాడు అని మనము చాలాసార్లు అనుకుంటాము. యూదా గనుక ప్రభువును అప్పగించకపోతే ఆయన సిలువ మరణం పొందేవాడు కాదు ఆయన సిలువ మరణం పొందకపోతే మనకు రక్షణ దొరికేది కాదు. దేవుడు గొప్ప ఉద్దేశంతో ఒక వ్యక్తిని నిర్మిస్తాడు. ఇది తప్పు అది తప్పు అని నిర్ణయించడం కొరకు ప్రభువు నిన్ను పిలువలేదు గాని ఆయనను వెంబడించి ఆయనలో ఉన్న దైవత్వాన్ని గుర్తించుట కొరకే నిన్ను పిలిచెను.

పనికిమాలినవారు కొందరు – ఈ మనుష్యుడు మనలను ఏలాగు రక్షింపగలడని చెప్పుకొనుచు అతని నిర్లక్ష్యము చేసి అతనికి కానుకలు తీసుకు రాకుండా ఉన్నారు. అటువంటివారిని సౌలు పట్టించుకొనక చెవిటివాడైనట్టు ఊరకుండెను. బెన్యామీను గోత్రములో పుట్టిన కీషు కుమారుడైన సౌలు దేవుని చేత రాజుగా ఏర్పాటు చేయబడెను. కాని ప్రజలు అతనిని వెదకినప్పుడు అతడు కనబడలేదు. అప్పుడు ప్రజలు దేవుని యొద్ద విచారణ చేసి అతను సామానులో దాగియున్నాడని తెలిసికొని పరుగెత్తిపోయి అతనిని తోడుకొని వచ్చిరి. అప్పుడు సమూయేలు – జనులందరిలో యెహోవా ఏర్పరచినవానిని మీరు చూచితిరా? జనులందరిలో అతనివంటివాడొకడును లేడని చెప్పగా, జనులందరు బొబ్బలు పెట్టుచు – రాజు చిరంజీవియగుగాక అని కేకలువేసిరి. ఇక్కడ జనులు సౌలు యొక్క ప్రాముఖ్యతను గుర్తించారు కాని దాగుకొనిన సంగతి చూడలేదు. నీవు దైవత్వాన్ని గురించి ఆలోచించే వ్యక్తివి అయితే ఎదుటి వ్యక్తి యొక్క విలువను గుర్తించి వెంబడించెదవు గాని ఎన్నడును విమర్శించవు. నీకు దేవుని నడిపింపుతో కూడిన మార్గాలు అర్థం కావాలి.



**“మరునాడు తెల్లవారునప్పుడు సమూయేలు – మిద్దెమీదనున్న సౌలును పిలిచి నేను నిన్ను సాగనంపుటకై లెమ్ము అని చెప్పగా సౌలు లేచెను. తరువాత వారిద్దరు బయలుదేరి ఊరి చివరకు వచ్చుచుండగా సమూయేలు సౌలుతో – మనకంటె ముందుగా వెళ్లుమని యీ పనివానితో చెప్పుము; దేవుడు సెలవిచ్చినది నేను నీకు తెలియజెప్పువరకు నీవు ఇక్కడ నిలిచి యుండుమనెను అంతట వాడు వెళ్ళెను”** 1సమూ. 9:26,27. సమూయేలును సౌలుకు పరిచయం చేసింది పనివాడు. ఇప్పుడు సౌలు లోపల పనివాడు బయట వుండాల్సి వచ్చింది. బయటకు వచ్చిన తరువాత పనివాడు నేనే కదా సౌలును సమూయేలు నొద్దకు తీసుకొని వచ్చింది అని అనుకొనలేదు. ఇక్కడ రెండు విషయాలు మనము నేర్చుకుంటాము. పనివాడు సౌలును సమూయేలుకు పరిచయం చేశాడు. అయితే సమూయేలు సౌలుతో చెప్పిన విషయాన్ని తెలుసుకోవాలనే మనస్సు పనివాడికి లేదు. సమూయేలు దగ్గరకు సౌలును తీసికొని వెళ్ళినది నేనే అని పనివాడు తన మనస్సులో ఎక్కడ బాధపడలేదు, ఆలోచించలేదు. అందుకే సమూయేలు ఏమి చెప్పాడు అని సౌలును అడగలేదు. మనకు అనవసరమైన విషయాలు ఎప్పుడూ మన భక్తి జీవితంలోనికి ప్రవేశింపనీయకూడదు. మన గురి ఎప్పుడు ప్రభువు మీదనే ఉండాలి. మనము ఏది చేయుట కొరకు పిలువబడ్డామో దాని చేయాలి. ఒక్క క్షణం అటుగాని ఇటుగాని చూడడానికి వీలులేదు. ఆ పనివాడు సౌలు రాజు కావడానికి కారకుడయ్యాడు. ఆ పనివాడు సమూయేలు పరిచయమవ్వడానికి కారణమయ్యాడు. అంతవరకే ఆ వ్యక్తి యొక్క పాత్ర.

అంద్రెయ, పేతురును ప్రభువు దగ్గరకు తీసుకొని వచ్చాడు. అయితే శిష్యులలో మొదటిపేరు పేతురుది అందుకని అంద్రెయ ఏమైనా ఆలోచన చేశాడా! మార్గాలు సరాళం చేసింది యోహాను అద్భుతాలు, సూచకక్రియలు చేసింది యేసుప్రభువు. యోహాను ఎక్కడ అద్భుతాలు చేసినట్లు వాక్యంలో లేదు. నీ పాత్ర ఎంతవరకో నీవు ఆలోచించి నీ భక్తి జీవితాన్ని కాపాడుకోవాలి. మనల్ని మనుష్యులు కాదు ప్రభువు చూస్తున్నారు. మన గురి ప్రభువు మనకు అప్పగించిన దాని మీదకు వెళ్ళాలి గాని మనుష్యుల మీదకు వెళ్ళకూడదు. సమూయేలు సౌలు పనివాడిని ముందు పంపివేసెను, సమూయేలు ద్వారా దేవుడు సెలవిచ్చిన

వాక్కులను తెలిసికొని ఆ తరువాత సౌలు వెళ్ళెను. మన పిలుపు ప్రభువును నమ్మకముగా వెంబడించడం. దేవుని చేత హృదయ ప్రేరేపణ నొందినవారముగా మనము పని చేయాలి.

**“యాబేషు వారి పెద్దలతో చెప్పగా వారు – మేము ఇశ్రాయేలీయుల సరిహద్దులన్నిటికి దూతలను పంపుటకై యేడు దినముల గడువు మాకిమ్ము; మమ్మును రక్షించుటకు ఎవరును లేకపోయిన యెడల మమ్మును మేము నీకప్పగించుకొనెదమనిరి. దూతలు సౌలు గిబియాకు వచ్చి జనులకు ఆ వర్తమానము తెలియజెప్పగా జనులందరు బిగ్గరగా ఏడ్చిరి సౌలు పొలమునుండి పశువులను తోలుకొని వచ్చుచు జనులు ఏడ్చుటకు హేతువేమని అడుగగా వారు యాబేషువారు తెచ్చిన వర్తమానము అతనికి తెలియజేసిరి ...”** 1సమూ. 11:3,4,5.

యాబేషువారు అమ్మోనీయులను ఏడు దినములు సమయం అడిగారు కాని శత్రువుల భయముతో నింపబడిపోయారు. దూతలు చెప్పిన మాట ప్రజలు ఎప్పుడైతే విన్నారో అప్పుడు ఏడ్వడం ప్రారంభించారు. సౌలు అప్పుడు పొలము నుండి పశువులను తోలుకొని వచ్చుచు జనులు ఏడ్చుటకు హేతువేమని అని అడిగెను. సౌలు హృదయం ప్రజల కొరకు కొట్టుకుంటుంది. నీ జీవితంలో చాలా ప్రాముఖ్యమైనది ఏమిటంటే నీ గురించి నీ కుటుంబం గురించి పరిస్థితుల గురించి బాధపడడం కాదు. పౌలు పత్రికల్లో ఒక మాట వ్రాస్తాడు **“నేనును మీ క్షేమము తెలిసికొని ధైర్యము తెచ్చుకొను నిమిత్తము తిమోతిని శీఘ్రముగా మీయొద్దకు పంపుటకు ప్రభువైన యేసునందు నిరీక్షించుచున్నాను... అందరు తమ సొంతకార్యములనే చూచుకొనుచున్నారు గాని, యేసుక్రీస్తు కార్యములను చూడరు.** ఫిలిప్పి. 2:19 జనులందరు ఏడుస్తున్నారు. కాని ఎందుకు ఏడుస్తున్నారు అని సౌలు తప్ప ఎవరు అడుగలేదు. అటువంటి వ్యక్తిని దేవుడు రాజుగా ఎన్నుకొన్నాడు. ఇప్పుడు అతని వెంట వెళుతున్నారు శూరులందరు. మనకు కూడ మన హృదయంలో మన సొంత కార్యముల మీద మనస్సు ఉందా? ప్రభువు కార్యములను గురించిన మనస్సు ఉందా? ప్రభువు కార్యముల మీద మనస్సు ఉంటే ఎవరు ఏమనుకుంటున్నారో అనేదాని మీదకు మనస్సు వెళ్ళదు. నేను ప్రభువు కొరకు ఏమి చేయాలి మరలా ఈ త్రోవలో రాను నేను ఆయన



చిత్తాన్ని సంపూర్ణం చేయాలి అనే మనస్సు ఉంటుంది. సౌలు అటువంటి హృదయంతో పని చేసాడు. సమూయేలు జనులకు అధిపతి అవుతావని చెప్పిన ప్రవచనం పనివాడికి కూడ సౌలు చెప్పలేదు. ఏ విషయాలు ఎవరితో చెప్పాలి, ఎవరితో చెప్పకూడదు అనే విషయాలలో సౌలు ప్రత్యేకమైన కృపను పొందినవాడు.

**“సౌలుయొక్క పినతండ్రి అతనిని అతని పనివానిని చూచి మీరిద్దరు ఎక్కడికి పోతిరని అడుగగా అతడు గార్దభములను వెదకబోతిమి; అవి కనబడక పోగా సమూయేలునొద్దకు పోతిమని చెప్పినప్పుడు సౌలు పినతండ్రి సమూయేలు నీతో చెప్పిన సంగతి నాతో చెప్పుమని అతనితో అనగా సౌలు గార్దభములు దొరికినవని అతడు చెప్పెనని తన పినతండ్రితో అనెను గాని రాజ్యమునుగూర్చి సమూయేలు చెప్పిన మాటను తెలుపలేదు”** 1సమూ. 10:14. సౌలు గార్దభముల సంగతి చెప్పెను గాని రాజ్యమును గూర్చి సమూయేలు చెప్పిన మాటలు ఎవరితోను చెప్పలేదు. సమయోచితంగా దైవత్వాన్ని పంచుకొనేవారితో మనము నడవాలి. ప్రజల యొక్క వేదనను అర్థం చేసుకొనేవారితో మనం నడవాలి. అలా నడిచేవారే హృదయ ప్రేరేపణ నొందిన శూరులు. నీకు దైవత్వం అర్థం అయితేనే దేవుని సంకల్పం కూడా అర్థం అవుతుంది. దేవుని సంకల్పం నీకు అర్థం కాకపోతే నీవు ప్రభువు కొరకు పని చేయలేవు . దేవుని సంకల్పం అర్థం కాని వారితో మనము చెవిటివారమైనట్టు ఉండాలి. మనము వారితో ఏది చెప్పిన కూడా అది ఏమియు వారిలో పని చేయదు. దేవుని వాక్యాన్ని మనము తీసుకున్నట్లయితే మనము దేవుని చేత హృదయ ప్రేరేపణ నొందిన వారమయితే ఎక్కడ దైవత్వం ఉందో దేవుని బిడ్డలు ఎలా నడుస్తున్నారో, వారి అనుసరించే భక్తి నేను కూడా నేర్చుకోవాలి అనే దాని మీదకు నీ కనుదృష్టి వెళ్ళిపోతుంది.

జనులు ఏడ్చుటకు కారణం తెలిసికొనిన సౌలు **“ఒక కాడి ఎడ్లను తీసి తునకలుగా చేసి ఇశ్రాయేలీయుల దేశములోని నలుదిక్కులకు దూతలచేత వాటిని పంపి సౌలుతోను, సమూయేలుతోను చేరకుండువాడెవడో వాని ఎడ్లను నేను ఈ ప్రకారముగా చేయుదునని వర్తమానము చేసెను. అందువలన యెహోవా భయము జనులమీదికి వచ్చెను గనుక యొకడైనను నిలువకుండ వారందరు**

**వచ్చిరి...”** 1సమూ. 11:37. సౌలుతో చేరనివాడు ఒక్కడు కూడా లేడు. ప్రజలమీదకి దేవుని భయము వచ్చినది. సౌలు మాటలు వినినవారు దేవుని భయముతో నింపబడిరి. మరి ఆ మాట పలికే సౌలుకు ఇంకెంత భయముండి ఉండాలి. దేవుని భయముతో నింపబడిపోయి ఉండాలి. జీవితములో తప్పిపోవడమనేది వేరే విషయం. కాని ఒకప్పుడు అతని జీవిత విధానములో ఆత్మీయతను చూసినప్పుడు ఎంతో దైవభయం కలిగినవాడుగా ఉన్నాడు. దైవిక భయంతో నింపబడిన ప్రజలు సౌలుతో చేరిరి. దేవుడు మనకు దైవభయం కలిగినవారిని ఇస్తారు. ఆ దైవభయం కలిగినవారి మాట వింటే మనకు కూడా దైవభయం వస్తుంది. నీవు ఎవరిని వెంబడించాలి అనుకుంటున్నావు, ఎటు వెళ్ళాలి అనుకుంటున్నావు? నీ గురి ఎటు ఉంది? నీ ఆలోచన సరళి ఎలా ఉంది? సౌలు రాజు అవ్వాలి అనుకోలేదు గాని కృపయే సౌలును రాజుగా చేసింది.

**“తరువాత సమూయేలు రాజ్యపాలనపద్ధతిని జనులకు వినిపించి ఒక గ్రంథమందు వ్రాసి యెహోవా సన్నిధిని దాని నుంచెను”** 1సమూ. 10:25 నేను రాజును కాబట్టి రాజ్యపాలన పద్ధతిని నాకు చెప్పమని సౌలు అనలేదు. సమూయేలు అందరికి వినిపిస్తుంటే నాకు మొదట ప్రాముఖ్యత ఇవ్వలేదని అనుకొనలేదు. అటువంటి వ్యక్తిత్వం గలవారిని మనము వెంబడించాలి. అక్కడ రాజైన సౌలుకు ప్రత్యేకమైన ప్రాధాన్యత లేదు. రాజ్యపాలన పద్ధతిని గ్రంథమందు వ్రాసి సమూయేలు దానిని దేవుని సన్నిధిలో పెట్టాడు. ఏ విధమైన ప్రత్యేకతను కోరుకొనని వ్యక్తి సౌలు. మన జీవితములో ప్రభువు మనల్ని నడిపించే మార్గము ఆయన నామము మాత్రమే మహిమ పరచబడునట్లుగా ఉంటుంది. మరి నీవు నడిచే మార్గము ఎలా ఉంది? సౌలు ఎక్కడా ఏ ప్రత్యేకతను కోరుకొనలేదు. అందుకే దేవుడు నలభై సంవత్సరాలు సౌలుకు కృప మీద కృప చూపించాడు. సౌలుకు ఇచ్చిన కృప చాలా గొప్పది ఒక ప్రక్క ప్రార్థన చేసే సమూయేలును ఇచ్చారు. మరొక ప్రక్క యుద్ధం చేసే దావీదును ఇచ్చారు. ఎంత గొప్ప కృప ప్రార్థన చేసేవారు ఉన్నారు, యుద్ధం చేసేవారు కూడ ఉన్నారు. మనము ప్రయాసను కనుక్కోవాలి. అదే మనకు దీవెన ఆశీర్వాదం. మన ముందు పరిశుద్ధులను ఉంచినప్పుడు వారితోపాటు నడవడం గొప్ప ఆశీర్వాదం.



## సువార్త ఉజ్జీవ కూటములు

| | |
|---|---|
| **2017 మే 16,17,18** | **నల్గొండ**, N.G. కాలేజి గ్రౌండ్స్ |
| **2017 మే 19,20,21** | **బళ్ళారి**, వార్డ్లా కాలేజి మైదాన్ |
| **2017 మే 22,23,24** | **కర్నూల్**, S.T.B.C గ్రౌండ్స్ |
| **2017 మే 25,26,27** | **నెల్లూరు**, V.R.C గ్రౌండ్స్ |
| **2017 మే 28,29** | **నరసాయపాలెం**, బాపట్లరోడ్ |
| **2017 జూన్ 2,3,4** | **మచిలీపట్టణం**, నోబుల్‌కాలేజిఎదురు ఆశీర్వాద్ భవన్ గ్రౌండ్స్ |
| **2017 జూన్ 5,6,7** | **ప్రొద్దుటూరు**, మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్ |
| **2017 జూన్ 8,9,10** | **ఒంగోలు**, A.B.M డిగ్రీకాలేజి గ్రౌండ్స్ |
| **2017 జూన్ 12,13,14** | **హిందూపురం**, C.&I.G. మిషన్ చర్చ్ కాంపౌండ్ |
| **2017 జూన్ 15,16,17** | **మదనపల్లి**, C.S.I మిషన్ కాంపౌండ్ |

# బోయజు

(గత సంచిక తరువాయి)

నయోమి రూతును నా కుమారి అని సంభోదించెను అయితే ఓర్పాను కూడా నా కుమార్తె అని సంభోదించెను. ప్రియులారా! ఓర్పా దర్శనమును పోగొట్టుకున్న కుమార్తెగా మిగిలెను. రూతు ప్రభువు కొరకు ముందుకు నడిచి ధన్యురాలుగా మిగిలినది. నయోమి రూతుతో బోయజు మనకు బంధువు అని తెలియజేసెను. మొట్టమొదట బోయజు గురించి సాక్ష్యం చెప్పినది. తరువాత బంధుత్వము గురించి మాట్లాడినది. నయోమి రూతుతో ఈ రాత్రి బోయజు కళ్లములో పండుకొనును నీవు స్నానము చేసి తైలమురాసుకొని కళ్లమునకు వెళ్ళుమని తెలియజేసెను. అప్పటివరకు నయోమి నోట బలహీనమైన మాటలే రూతు విన్నది. ఇటువంటి బలహీనమైన మాటలు మాట్లాడేవారి మాట ఎందుకు వినాలి అని రూతు తలంచుకొనలేదు. కాని నీవు సెలవిచ్చినదంతయు చేసెదనని చెప్పి ఆ కళ్లము నొద్దకు పోయి తన అత్త ఆజ్ఞాపించినది అంతయు చేసెను. బోయజు కాళ్ళ దగ్గర రూతు పండుకొన్నది. మధ్యరాత్రి సమయములో బోయజు ఉలికిపడి చూచి రూతును పలుకరించెను. కాని అపవిత్రమైన తలంపు బోయజులో లేదు. రూతును పగలు రాత్రి వేళలలో కూడా నా కుమారి అని సంభోదించెను. నా కంటె నీకు సమీప బంధువుడు ఒకడు ఉన్నాడు అతడు బంధువు ధర్మము జరిపినయెడల సరి అతడు జరిపించకపోతే యెహోవా జీవముతోడు నేనే నీకు బంధువుని ధర్మము జరిపెదనని చెప్పెను. బోయజులో ఎక్కడ తొందరపాటులేదు. బోయజు రూతుతో నీవు కళ్లములోకి వచ్చిన సంగతి ఎవరితో చెప్పవద్దు అని చెప్పెను. ఒకరినొకరు గుర్తించక ముందే బోయజు రూతును పంపించెను. దేవుడు బోయజుకు ఇచ్చిన దైవిక జ్ఞానమునకై దేవుని స్తుతించవలెను. రూతు దుప్పటిలోనే ఆరు కొలల యవలు కొలిచి యిచ్చెను. దేవుడు తనకు ఇచ్చిన ఆస్తి విషయములో ఎంతో జాగ్రత్త కలిగి నడుచుకొనెను. నయోమి రూతుతో ఈ దినముననే అతడు ఆ మాటను నెరవేర్చుననియు నెరవేర్చువరకు అతడు ఊరకుండడనియు తెలియజేసెను.



**“అప్పుడు ఆమె నా కుమారీ, యీ సంగతి నేటిదినమున నెరవేర్చితేనే కాని ఆ మనుష్యుడు ఊరకుండడు గనుక యిది ఏలాగు జరుగునో నీకు తెలియువరకు ఊరకుండుమనెను”** రూతు 3:18 బోయజు పురద్వారమునకు వెళ్ళి కూర్చుండెను. రూతుకు న్యాయము జరుగు వరకు తాను ఇచ్చిన మాట మరచిపోయేవాడుకాదు ఆలస్యము చేయువాడు కాదు. సమీపబంధువు రూతుకు న్యాయము చేయకపోవుట చూచి పెద్దల సమక్షంలో బోయజు రూతును వివాహము చేసుకొనెను. బోయజు సమస్తమును దైవక్రమములో జరిగించెను. బోయజులో మనము అనేక విషయములను నేర్చుకొనవచ్చును.

ప్రియులారా! పొలములో, కళ్లములో, ఊరిపెద్దల యొద్ద, రాత్రి కాలములో, సర్వసమాజము నొద్ద బోయజు సాక్ష్యమును కాపాడుకొనెను. దేవుని చిత్తమును జరిగించెను. బోయజు జీవితమంతటిలో పొరపాట్లు కనిపించవు. ఈ చివరి దినములలో అన్ని పరిస్థితులలో బోయజు వలె సాక్ష్యము కాపాడుకొని ప్రభువు చిత్తము చేయుటకు పరిశుద్ధాత్ముడు మనకు సహాయము చేయును గాక!


<u>మా వద్ద లభించు పుస్తకములు</u>

**దేవుడు టిబెట్ భాష మాట్లాడెను**

**ఉజ్జీవం ఎందుకు ఆలస్యమవుతుంది?**

**ఉజ్జీవ ప్రార్థన**

**దేవుని మార్గములో ఉజ్జీవం**

**ఆత్మీయతకు బలమైన పునాది**

**సొదొమకు బైబిలు లేదు**

**శ్రేష్టమైనది**

**ప్రార్థనా సంపద**

# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 19 మే : 2017 విడుదల : 8

**నీవును ఈ నీ దినమందైనను**
**సమాధానసంబంధమైన సంగతులను**
**తెలిసికొనినయెడల నీకెంతో మేలు**

—లూకా 19:42

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2016-18

**క్రీస్తు ఎవరిని అయితే మచ్చిక చేసుకొని**
**తన స్వాధీనంలోకి తీసుకుంటాడో**
**అతను పరిస్థితులన్నిటినీ మచ్చిక**
**చేసుకోగల సమర్థుడు. పరిస్థితులు**
**మిమ్మల్ని అటూ ఇటూ నొక్కి**
**వేధిస్తున్నాయా? దూరంగా నెట్టెయ్యకండి.**
**కుమ్మరివాడి చేతులవి.**
**ఆ పరిస్థితుల నుంచి తప్పించుకోవడం**
**వల్ల కాక, క్రమశిక్షణతో భరిస్తే**
**ఆయన పనితనం బయట పడుతుంది.**
**నిన్నాయన ఘనతకి తగిన పాత్రగా**
**మలచడమే కాదు, నీలో దాక్కుని ఉన్న**
**శక్తి సామర్థ్యాలను బయటికి**
**తేవడం కూడా చేస్తున్నాడు.**

To,
Sri / Smt.

If undelivered please return to :
Bro. **DEEVANAIAH**, Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : 9491475967, 9290901396

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 11th & 12th of Every Month